



దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 288 సోమవారం 14-10-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | పేజీలు : 4 | వెల : 5 రూ/..


# అలయ్ బలయ్‌తోనే రాజకీయ జేఏసీ

## తెలంగాణ సాధనకు ఈ కార్యక్రమమే స్ఫూర్తి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు



**తొలి సమయం హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సాధనకు 'అలయ్ బలయ్' స్ఫూర్తి అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఉద్యమ సమయంలో రాష్ట్ర సాధన ఆలస్యమవుతోందని భావించిన తరుణంలో రాజకీయ జేఏసీ ఆవిర్భవించిందని.. దాని ఏర్పాటుకు స్ఫూర్తి అలయ్ బలయ్ కార్యక్రమమేనని చెప్పారు. ఆ జేఏసీ ఫలితంగా ఆరెస్సెస్ నుంచి ఆర్‌ఎసయూ వరకు, కమ్యూనిస్టుల నుంచి కాంగ్రెస్ వరకు.. అన్ని వర్గాలు కార్యోన్ముఖులయ్యాయని వివరించారు. తెలంగాణ ప్రజలకు అతిపెద్ద పండగ అయిన దసరా అనగానే పాలపిట్ట, జమ్మిచెట్టు గుర్తుకు వచ్చినట్లుగానే అలయ్ బలయ్ అనగానే బండారు దత్తాత్రేయ గుర్తుకొస్తారని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలకు రాజకీయాలతో సంబంధం లేదన్నారు. అందుకే ప్రభుత్వం తరఫున, కాంగ్రెస్ తరఫున తాను, మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు హాజరయ్యారని రేవంత్ అన్నారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి రేవంత్ హాజరయ్యారు. అలయ్ బలయ్ నిర్వహణ కమిటీ చైర్‌పర్సన్, దత్తాత్రేయ కుమార్తె బండారు విజయలక్ష్మి అధ్యక్షతన కొనసాగిన ఈ కార్యక్రమంలో ఉత్తరాఖండ్, రాజస్థాన్, మేఘాలయ గవర్నర్లు, వివిధ పార్టీల ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. ఉద్యమం సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంలో రాజకీయ పార్టీలు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించుకోగా.. దత్తాత్రేయ అలయ్ బలయ్‌తోనే జెండాలకు, అజెండాలకు అతీతంగా రాజకీయ జేఏసీ ఏర్పడిందని చెప్పారు. దత్తాత్రేయ వారసురాలిగా అలయ్ బలయ్‌ని నిర్వహిస్తున్న విజయలక్ష్మిని రేవంత్ అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ.. మన సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి ఎంతో ఉన్నతమైందని కొనియాడారు. సమాజంలో సమైక్యతా వారధుల నిర్మాణాన్ని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా గుర్తించి, ఆ దిశగా కృషి చేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. పండగలకు ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ప్రాముఖ్యత కూడా ఉందన్నారు. సనాతన ధర్మంలో నేను, నాది అన్నది లేదని.. మనది, మనందరిది అని ఉంటుందని తెలిపారు. తెలుగు రాష్ట్రాల సీఎంలు కలిసి మెలిసి పనిచేయాలని, రెండు రాష్ట్రాలను దేశంలో నంబర్ వన్‌గా నిలపాలని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆకాక్షించారు. సామాన్య కుటుంబం నుంచి వచ్చిన రేవంత్ ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ముఖ్యమంత్రి కావడం గొప్ప విషయం అని ప్రశంసించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అలయ్ బలయ్ గొప్ప కార్యక్రమం అన్నారు. ఎన్నికల సమయంలో పార్టీలు విమర్శలు చేసుకోవచ్చు కానీ, ఎన్నికల తర్వాత పేదల సంక్షేమం, అభివృద్ధిపైనే దృష్టిపెట్టాలని చెప్పారు. దురదృష్టవశాత్తు రాష్ట్రంలో అది లోపించిందని, నోటితో చెప్పలేని విధంగా పార్టీలు విమర్శలు చేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాలంటేనే ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. దత్తాత్రేయ పేరు వినగానే హెూలీ, అలయ్ బలయ్ గుర్తుకొస్తాయని.. దత్తాత్రేయ హెూలీ ఆడితే 3 నెలలపాటు రంగు పోదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు.

# కులగణన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు

**వచ్చే వర్షాకాలం వరకు గౌరవెల్లి కాల్వల ద్వారా సాగునీటి సరఫరా**

**రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్**



**తొలి సమయం,హుస్నాబాద్, అక్టోబర్ 13:** కులగణన ప్రక్రియ పూర్తయిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో దసరా సందర్భంగా శమీ పూజ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం జరిగేలా ప్రభుత్వం జీవో 18 తెచ్చిందని, 60 రోజుల్లో సంపూర్ణంగా సర్వే నిర్వహించి కులగణన పూర్తిచేయాల్సి ఉంటుందన్నారు. బీసీ కమిషన్ సూచన మేరకు కులగణన చేపడుతున్నామని, ఈ ప్రక్రియ షురూ కావడం బీసీ మంత్రిగా హర్షం వ్యక్తం చేస్తున్నానని చెప్పారు. గడిచిన పది నెలల్లో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కోహెడ మండలంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు భూమిపూజ, హుస్నాబాద్ పట్టణానికి రూ.28కోట్లు మంజూరు, రూ.37కోట్లతో ఎల్లమ్మ చెరువు ఆధునీకరణ పనులు, రూ.4.70కోట్లతో సర్వాయి పాపన్న కోట అభివృద్ధి, అక్కన్నపేటలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు, రూ.1.75కోట్లతో ఎల్కతుర్తి కూడలి అభివృద్ధి, రూ.70కోట్లతో పీఆర్ రోడ్లు తదితర పనులు చేపట్టామన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని, ఇందుకోసం ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీలు వేస్తున్నదని తెలిపారు. మొదట నిరుపేదలకే ఇండ్లు వస్తాయని, ఇందుకు అందరూ సహకరించాలని కోరారు. మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడం కోసం గౌరవెల్లి రిజర్వాయర్ కాల్వ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి వచ్చే వర్షాకాలం వరకు పంటలకు సాగునీరందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. గిరిజన తండాలకు పెద్ద ఎత్తున నిధులు తేనున్నట్లు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధిపై అధికారులతో ఎప్పటికప్పుడ సమీక్షలు నిర్వహించి పనుల్లో పురోగతి ఉండేలా చూస్తామన్నారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు లేకుండా ఉద్యోగులను నియమిస్తున్నామని, త్వరలోనే మెడికల్ క్యాంపులు, ఉద్యోగ మేళాలు నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. సమావేశంలో సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు మంజులారెడ్డి, జంగపల్లి అయిలయ్య, చిత్తారి రవీందర్, బంక చందు, అక్కు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు పిల్లలతో తండ్రి ఆత్మహత్య

## కుమారులను బావిలోకి తోసి.. తానూ దూకి బలవన్మరణం



**తొలి సమయం తాడ్వాయి, అక్టోబరు 13:** కుటుంబ కలహాలతో విసిగిపోయిన ఆ ఇంటి పెద్ద.. తన ఇద్దరు పిల్లలతో కలిసి చనిపోవాలకున్నాడు. దసరా రోజు కుమారులిద్దరినీ వ్యవసాయ బావిలోకి తోసేశాడు. ఆపై అతడు కూడా దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. పండుగ రోజున జరిగిన ఈ ఘటన కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నందివాడలో విషాదం నింపింది. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నాయగావ్‌కు చెందిన శ్రీనివాసరెడ్డి(36) 12 ఏళ్ల క్రితం నందివాడకు చెందిన చిట్టెపు గుండారెడ్డి-సుగుణవ్వల కుమార్తె అపర్ణను వివాహం చేసుకుని ఇల్లరికం వచ్చాడు. భార్యతో పాటు అత్తా మామలతో కలిసి నందివాడలోనే ఉంటున్నాడు. కొన్ని రోజులుగా శ్రీనివాసరెడ్డికి భార్య, అత్తమామలతో విభేదాలు వచ్చాయి. 'నువ్వు ఇల్లరికం వచ్చావ్' అంటూ అత్త మామ, భార్య పెత్తనం పెరగడం ఆయనను మరింత మనస్తాపానికి గురి చేసింది. దీంతో 6 నెలల నుంచి శ్రీనివాసరెడ్డి వేరుగా ఉంటున్నాడు. క్రికెట్ బెట్టింగ్, జూదానికి అలవాటు పడిన శ్రీనివాసరెడ్డి రూ.లక్ష వరకు అప్పు చేసినట్లు తెలిసింది. ఇలా కుటుంబకలహాలు, అప్పులు పెరగడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. శనివారం రాత్రి దసరా సందర్భంగా బంధువులకు జమ్మి పెడతానని కుమారులు విగ్నేశ్‌రెడ్డి(4), అనిరుధ్ రెడ్డి(6)లను తీసుకెళ్లాడు. వ్యవసాయ భూమి పక్కన ఉన్న బావిలో ఇద్దరు పిల్లలను తోసి, ఆపై తాను కూడా దూకాడు. ఆదివారం తెల్లవారుజామున ముగ్గురి మృతదేహాలు బయపడ్డాయి.

# మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్దిఖీ హత్య

**ముంబైలో కాల్చి చంపిన ముగ్గురు వ్యక్తులు..**

**కుమారుడి కార్యాలయం వద్ద ఉండగా ఘటన**

**తమ పనేనన్న లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్**



**ముంబై, అక్టోబరు 13:** మాజీ మంత్రి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (అజిత్ పవార్)కి చెందిన నాయకుడు బాబా సిద్ధిఖీ హత్యకు గురయ్యారు. ముంబైలో ఆయనను ముగ్గురు వ్యక్తులు కాల్చి చంపారు. బాబా శనివారం రాత్రి బాంద్రాలోని తన కుమారుడు, వాంద్రే ఎమ్మెల్యే అయిన జీషన్ సిద్ధిఖీ కార్యాలయం వద్ద ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. కాల్పుల అనంతరం ఆయనను లీలావతి ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. బాంద్రా పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాబా సిద్ధిఖీ (66) మంత్రిగా పనిచేశారు. గత రెండు ఎన్నికల్లో పరాజయం పాలయ్యారు. ఈ సంవత్సరం ఎన్సీపీలో చేరారు. ముంబైలో ముస్లిం నాయకుడిగా బాగా పలుకుబడి కలిగిన సిద్ధిఖీ.. బాలీవుడ్ స్టార్ కథానాయకుడు సల్మాన్‌ఖాన్‌కు అత్యంత సన్నిహితులు. ఓ దశలో తీవ్ర విభేదాలతో కనీసం పలకరింపులు లేని సల్మాన్-షారుక్ ఖాన్ మధ్య సయోధ్య కుదిర్చింది సిద్ధిఖీనే.

సంజయ్ దత్ సహా పలువురు నటీ నటులతోనూ ఆయకు దగ్గరి సంబంధాలున్నాయి. ఈయన ఇచ్చే భారీ ఇఫ్తార్ విందులకు బాలీవుడ్ నటులు పెద్దఎత్తున తరలివచ్చేవారు. కాగా, సిద్ధిఖీపై కాల్పులకు పాల్పడిన ముగ్గురిలో ఇద్దరిని పట్టుకున్నామని, మరొకరు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో గుర్మైల్(23) హరియాణాకు చెందినవాడు. మిగతా ఇద్దరు యూపీ వాసులైన ధర్మరాజ్(19), శివకుమార్. శివకుమార్ పరారీలో ఉన్నాడు. హత్యకు కుట్రదారులుగా, నిందితులకు సాయపడినవారిగా భావిస్తున్నవారిలో ప్రవీణ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అక్తర్ కోసం గాలిస్తున్నారు. అయితే, ధర్మరాజ్ వయసు ఆధార్ ప్రకారం 21గా ఉన్నప్పటికీ.. అతడు మైనర్ (17)నని పేర్కొనడంతో వయసు నిర్ధారణ పరీక్షలకు కోర్టు ఆదేశించింది. మరోవైపు సిద్ధిఖీ హత్యకు కొన్ని నెలలుగా నిందితులు ప్రణాళికలు రచించారని, ముంబై, పుణెలలో నివాసం ఉన్నారని, సిద్ధిఖీ ఇల్లు, కార్యాలయంపై నిఘా పెట్టారని పోలీసులు తెలిపారు. హత్యకు గాను రూ.50 వేల అడ్వాన్స్ తీసుకున్నారని, ఆయుధాలను బిష్ణోయ్ గ్యాంగ్ సరఫరా చేసిందని పేర్కొన్నారు. సిద్ధిఖీ హత్య తమ పనే అని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. ఈ మేరకు గ్యాంగ్ సభ్యుడొకరు ఫేస్ బుక్‌లో పోస్ట్ పెట్టాడు. సల్మాన్‌తో పాటు దావూద్ ఇబ్రహీంతో సంబంధాలున్నందుకే అతడిని హతమార్చినట్లు పేర్కొంది. సిద్ధిఖీ హత్యతో సల్మాన్ ఇంటి వద్ద భద్రతను పెంచారు. సల్మాన్ ఆదివారం సాయంత్రం సిద్ధిఖీ ఇంటికెళ్లి భౌతిక ఖాయానికి నివాళి అర్పించారు. ఆ సమయంలో ఆయన తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. శనివారం సల్మాన్ బిగ్ బాస్ షూటింగ్ రద్దుచేసుకుని ఆస్పత్రిలో సిద్ధిఖీ మృతదేహాన్ని సందర్శించారు.

**20 ఏళ్లకే రాజకీయాల్లోకి**

సిద్ధిఖీ 1977లో రాజకీయాల్లోకి వచ్చారు. అసలు పేరు జియాఉద్దీనన్ సిద్ధిఖీ. 1999 నుంచి వరుసగా మూడుసార్లు బాంద్రా వెస్ట్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2000 సంవత్సరంలో కార్మిక, పౌర సరఫరాలు తదితర శాఖల మంత్రిగా నియమితులయ్యారు.

# సమయం దాటిన తర్వాత డీజే సౌండ్స్

## మేయర్ సహా ముగ్గురిపై కేసు

తొలి సమయం హైదరాబాద్,



బతుకమ్మ వేడుకలసందర్భంగా నిర్దేశిత సమయం దాటిన తర్వాత కూడా పెద్ద ఎత్తున డీజే సౌండ్స్ ఉపయోగించిన ఘటనలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు మరో ఇద్దరు వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 10న సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని ఎన్‌బీనగర్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో భారీ ఎత్తున వేడుకలు నిర్వహించారు. కాగా, రాత్రి 11.45 తర్వాత కూడా డీజే సౌండ్స్ పెట్టడంతో స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని అడ్డుకునేందుకు యత్నించారు. అయితే మహిళలు అడుకునే బతుకమ్మ వేడుకలను ఎలా ఆపుతారంటూ మేయర్ వారిని ప్రశ్నించారు. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో ఈ మేరకు పోలీసులు కార్యక్రమ నిర్వాహకుడు విజయ్‌కుమార్, డీజే సౌండ్స్ నిర్వాహకుడు గౌస్‌తో పాటు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఓటమి అనేక పాటలు నేర్పిస్తుంది: జగ్గారెడ్డి

**తొలి సమయం సంగారెడ్డి:** కాంగ్రెస్ సీనియర్ నేత, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి శనివారం దసరా వేడుకల్లో కామెంట్స్ చేశారు. ఓటమి అనేక పాటలు నేర్పిస్తుందని, తాను ఓడిపోయినా.. తన భార్యకు కార్పొరేషన్ పదవి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలిచి ఆయన కోటాలోనే తన భార్య నిర్మలకు పదవిచ్చారన్నారు. ఏ పండుగ వచ్చినా ముందుండి సంగారెడ్డి లో కార్యక్రమాలు చేస్తానని అన్నారు. జగ్గారెడ్డి ఎప్పుడు బలహీనుడు కాదని, అదిరేటొడు.. బెదిరేటోడు కాదని.. జగ్గారెడ్డి ఓ ఫైటర్ అని అన్నారు. 1995లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అప్పటి ఎస్పీ కృష్ణంరాజు తన మనుషులను కొట్టారని.. దీంతో



ఆయన కారును ఢీ కొట్టానని, ఆ తర్వాత పోలింగ్ బూత్‌లలో రిగ్గింగ్ చేశానని జగ్గారెడ్డి చెప్పారు. 3 వేల మందితో పోలీస్ స్టేషన్ ముట్టడించానని.. ఎంత తోపులం అయినా సరే ఓ రోజు కాటికి వెళ్ళక తప్పదని అన్నారు. ప్రాణికి చావుంది కానీ పైసాకు చావు లేదని... వచ్చే ఎన్నికల్లో తన భార్య నిర్మల గానీ.. ఆంజనేయులు కానీ ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం ఉందని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. కాగా రుణమాఫీ అంశంపై ఇటీవల అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య పెద్ద యుద్ధమే నడిచింది. ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ చేశామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతుండగా.. రుణమాఫీతో రైతులను కాంగ్రెస్ మోసం చేసిందంటూ బీఆర్ఎస్ విమర్శలు గుప్పించింది. ఈ అంశంపై ప్రతీరోజు ఇరుపార్టీల నేతలు ఒకరిపై ఒకరు మాటల తూటాలు పేల్చుతూనే ఉన్నారు. అయితే రుణమాఫీ అంశంపై జగ్గారెడ్డి స్పందించారు. రుణమాఫీకి సంబంధించి బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావుకు జగ్గారెడ్డి ఛాలెంజ్ విసిరారు. రుణమాఫీపై చర్చకు బీఆర్ఎస్ సిద్ధమా అంటూ సవాల్ చేశారు. రుణమాఫీపై రైతులతో చర్చ చేద్దామని.. ఎల్లిగాడు, మల్లిగాడు కాకుండా కేసీఆర్ చర్చకు రావాలన్నారు.

# జగిత్యాలలో ఉడిపి హొటల్‌పై కేసు

## మహిళా నిరసనతో చర్యలు



**తొలి సమయం, జగిత్యాల అక్టోబర్ 13** జగిత్యాల పట్టణంలో ఒక ప్రముఖ హొటల్‌లో జరిగిన సంఘటన జిల్లా అంతట ప్రస్తుతం సంచలనం సృష్టిస్తోంది. గణేష్ భవన్ ఉడిపి హొటల్‌లో ఓ మహిళ ఇడ్లీ ఆర్డర్ చేసి తినే ప్రయత్నంలో దానిలో జెర్రీ కనిపించడం నిర్లక్ష్యానికి నిదర్శనమని, ఇది ఆరోగ్యానికి ప్రమాదకరమని ఆమె హొటల్ ఎదుట ఆందోళనకు దిగింది. ఈ సంఘటన స్థానిక ప్రజలను కలవరపెట్టడంతో పాటు హొటల్ నిర్వాహకుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్టోబర్ 13న ఉదయం దాదాపు పది గంటలకు ఒక మహిళ తన కుటుంబంతో కలిసి గణేష్ భవన్ ఉడిపి హొటల్‌కు వచ్చి ఇడ్లీ ఆర్డర్ చేసింది. ఆమె తన చిన్నపిల్లలకు ఆహారం అందించే ప్రయత్నంలో ఇడ్లీలో జెర్రీ కనిపించింది. ఈ ఘటనతో షాక్‌కు గురైన ఆమె హొటల్ యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నిర్లక్ష్యం వలన తమ కుటుంబం ఆరోగ్యానికి ముప్పు వాటిల్లిందని ఆరోపించింది. "చిన్నపిల్లలు ఉన్నారు. వారు తింటే పరిస్థితి ఏమిటి?" అంటూ ఆమె హొటల్ యజమానికి ప్రశ్నలు సంధించింది. వివాదానికి కారణం మహిళా నిరసన చేయడం తో హొటల్ యజమాని సీతారాములు ఆమెకు సమాధానం ఇవ్వాలని ప్రయత్నించాడు. మొదట, జెర్రీ కాదని, అది కేవలం నల్ల దారం వల్ల తలెత్తిన సమస్య అని చెప్పిన

యజమాని, తన మాటలకు కట్టుబడి ఉండలేక, ఇడ్లీని తన నోట్లో వేసుకుని చూడటానికి ప్రయత్నించాడు. అయితే, తాను కూడా జెర్రీ అని నిర్ధారించుకున్న తరువాత, హొటల్ యజమాని ఆ ఇడ్లీని ఉమ్మివేశాడు. ఈ చర్యతో అక్కడి ప్రజలు, కస్టమర్లు కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు నిరసనకారులు సంఘటన నేపథ్యంలో బాధితురాలు హొటల్ ముందు నేరుగా నిరసన చేపట్టింది. స్థానికులు కూడా ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, హొటల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళా రోడ్డుపై బైఠాయించి, హొటల్ యాజమాన్యం నిర్లక్ష్యానికి చట్టపరమైన చర్యలు తీసుకునే వరకు అక్కడి నుంచి వెళ్లబోమని సవాలు చేసింది. ఈ సందర్భంగా హొటల్ యాజమాన్యం ఇడ్లీలను బల్దియా ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, బాధితురాలు ఇతర ప్రజలు అడ్డుకున్నారు. ఇడ్లీలను రోడ్డు మీదే పారవేసి, ఆరోగ్యంపై ఇలాంటి ప్రమాదాలు రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హొటల్ నిర్వహణలో క్లీన్ లైనెస్ క్వాలిటీ నియంత్రణ పూర్తిగా లేకపోవడంతో, ప్రజలు ఆగ్రహానికి గురయ్యారు. చట్టపరమైన చర్యలు ఈ సంఘటనపై పట్టణంలోని ప్రజలు, ప్రత్యేకంగా ఆరోగ్యవర్గాలు, హొటల్ యాజమాన్యంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై వెంటనే స్థానిక మున్సిపల్ అధికారులు ఆహార సురక్షితత్వ విభాగం స్పందించి, హొటల్‌ను పరిశీలించి, ఆహార నాణ్యత ప్రమాణాలు పాటించడంలో విఫలమయ్యారని నిర్ధారించారు. మహిళ చేసిన ఫిర్యాదుతో, పోలీసులు హొటల్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. స్థానిక ఆహార ఆరోగ్య అధికారుల సహకారంతో, హొటల్‌ను తాత్కాలికంగా మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు. సమాజంలో స్పందన ఈ సంఘటన పట్టణంలో విశేష చర్చనీయాంశంగా మారింది. ప్రజలు తమ ఆరోగ్యం పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి సంఘటనలు సమాజంలో కలవరం రేకెత్తిస్తున్నాయి. ప్రజలు ఆరోగ్యానికి ఇబ్బందులు కలిగించే హొటళ్ళపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ అధికారులను కోరుతున్నారు. మున్ముందు చర్యలు హొటల్స్, రెస్టారెంట్లలో ఆహార నాణ్యతను నిర్ధారించడానికి కఠినమైన నియమాలు ఉండాలని, వాటిని పాటించకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.

# బయ్యారం ఇందిరమ్మ కమిటీల్లో

# చక్రం తిప్పుతున్న మాజీ బీఆర్ఎస్ లీడర్

**10 ఏళ్ళు టిఆర్ఎస్ పై పోరాటం చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయలు బలిపశువులు..**

**కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తుకు ఈ పద్ధతి మంచిది కాదు**

**బయ్యారం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి**



**తొలి సమయం బయ్యారం అక్టోబర్ 13 :** పదేళ్లుగా బిఆర్ఎస్ లో అధికారం ఆరగించి, కాంగ్రెస్ ను గెలవకుండా ముప్పేట దాడి చేసి, శతవిధాల కాంగ్రెస్ వ్యతిరేక ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ లీడర్లు కాంగ్రెస్ గెలవగానే గత్యంతరం లేని పరిస్థితుల్లో కాంగ్రెస్ కండువా కప్పుకున్నోళ్లంతా టిఆర్ఎస్ కార్యకర్తలను కాపాడుకునేందుకు కాంగ్రెస్ లో కూడా చక్రం తిప్పడం దుర్మార్గమైన అన్యాయమని బయ్యారం పట్టణ అధ్యక్షులు కార్యదర్శి నాయిని శ్రీనివాస్ రెడ్డి ఆవేదనపడ్డారు.. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కమిటీ సీనియర్లను ఆలోచించకుండా ఇందిరమ్మ ఇండ్ల కమిటీని ఏర్పరచడంలో టిఆర్ఎస్ నుంచి వచ్చిన ఓ లీడరు రింగు తిప్పడం, మొత్తం బిఆర్ఎస్ నుండి వచ్చిన వాళ్లతోనే ఇందిరమ్మ కమిటీలో నింపుతున్నాడని ఆరోపణ చేశారు.. కాంగ్రెస్ పార్టీని జెండాలు మూసినోళ్లను. ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొన్న వాళ్ళను, కేసుల పాలు అయ్యినోళ్లను పక్కన పెట్టేసారని, దీనివల్ల నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు, కుటుంబాలకు అన్యాయం జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని అన్నారు. ఈ ద్వంద వైఖరి రేపు జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రమాదం ఉంచి ఉన్నదని అన్నారు. లబ్ధిదారులను ఎంపిక చేయడంలో మళ్లీ డబ్బులు వసూలు చేసే ప్రమాదం లేకపోలేదని అన్నారు. ప్రతి గ్రామపంచాయతీ ఇందిరమ్మ కమిటీలో 5గురు, మరియు స్పెషల్ అధికారి, కన్వీనర్గా కార్యదర్శి ఉంటారు, ముఖ్యంగా ఐదుగురిలో కాంగ్రెస్ కు సంబంధించిన వారు తక్కువ సంఖ్యలో ఉండడం భవిష్యత్తులో స్థానిక సంస్థల ఎన్నికలపై దుష్ప్రభావం పడే ప్రమాదాలు లేకపోలేదని అన్నారు. కనుక టిఆర్ఎస్ లో అధికారం ఆరగించి అవకాశ వాదులుగా కాంగ్రెస్ లోకి వచ్చిన ఆ వ్యక్తి నడవడికను అధిష్టానం జాగ్రత్తగా గమనించి, బయ్యారం మండలంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులను నిమిత్తమాత్రులను చేయకుండా మా ఆత్మగౌరవాన్ని కాపాడాలని అధిష్టానాన్ని కోరుకున్నారు. పది సంవత్సరాలుగా బీఆర్ఎస్ లో ఉన్నవాళ్లు కాంగ్రెస్ లోకి వచ్చాక ఏ స్థాయిలో ఉన్నారు, కాంగ్రెస్ జెండాను మోసిన మేము ఏ స్థాయిలో ఉన్నాము అధిష్టానం గమనించి. బయ్యారం మండలంలో కాంగ్రెస్ పార్టీలో జరిగే గందరగోళానికి అధిష్టానం తెరదించాలని కోరారు, కాంగ్రెస్ పార్టీని నమ్మిన వాళ్లకు అన్యాయం చేయడంవలన కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉన్నదని అన్నారు..

# మృతులు చుక్కల ఉదయ్ చందర్ దశదినకర్మకు కాంగ్రెస్ ప్రముఖులు







**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 14:** చుక్కల ఉదయ్ చందర్ స్వగృహంలో జరిగిన దశదినకర్మకు కాంగ్రెస్ ప్రముఖులు,హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఉదయ్ చందర్ కుటుంబాన్ని ఓదార్చారు.

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్ రెడ్డి ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రునాయక్, మంత్రి ధనసరి సీతక్క, ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్, బీసీసీ అధ్యక్షులు జన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, కేయు పాలకమండలి సభ్యులు బాలు చౌహన్, గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సిపిఎం, మునిసిపాలిటీ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, జన సమితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ డోలి సత్యనారాయణ, మైసా నాగయ్య మాజీ ఒడిసిఎంఎస్ చైర్మన్ నూకల వేణుగోపాల్ రెడ్డి, పార్నంది రామయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పిటిసి జిన్నా రెడ్డి వెంకటేశ్వర్లు,

టిపిటిఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు మైసా శ్రీనివాస్ గణపురపు అంజయ్య, కుల సంఘాల నేతలు సామాజిక సంఘాల నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# వీడని విషజ్వరాలు

**తొలి సమయం సంగారెడ్డి,అక్టోబర్ 13:** సంగారెడ్డి జిల్లాలో విషజ్వరాల బెడద ఇంకా తగ్గలేదు. డెంగీ, టైఫాయిడ్ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో విషజ్వరాలతో రోగులు బారులు తీరుతున్నారు. ఈనెల ఇప్పటి వరకు 23 డెంగీ కేసులు నమోదయ్యాయి. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని పీహెచ్‌సీలతో పాటు మున్సిపాలిటీల్లోని ప్రభుత్వ దవాఖానలు, సంగారెడ్డిలోని జనరల్ దవాఖానలో డెంగీ కేసులు, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. ప్రభుత్వ దవాఖానలకు రోగుల తాకిడీ పెరుగుతున్నది. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో నిత్యం 500 నుంచి 1000 మంది వరకు అవుట్ పేషంట్స్ వస్తున్నారు. వర్షాకాలం ప్రారంభం నుంచే సంగారెడ్డి జిల్లాలో విషజ్వరాల బెడద మొదలైంది. దోమల బెడద పెరగడం, పారిశుధ్యలోపం తదితర కారణాలతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో పారిశుధ్య నిర్వహణ అటకెక్కింది. గ్రామాల్లో ఎక్కడవేసిన చెత్త అక్కడనే పేరుకు పోవడంతో పాటు మురుగు కాల్వలు సరిగ్గా శుభ్రం చేయడం లేదు. గ్రామాల్లో చెత్తసేకరించి డంప్‌యార్డుకు తరలించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ట్రాక్టర్, ట్రాలీని సమకూర్చింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ట్రాక్టర్లలో డీజిల్ పోయలేని పరిస్థితి నెలకొంది. పారిశుధ్య లోపంతో దోమల బెడద పెరిగింది. పట్టణాల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో ప్రజలు విషజ్వరాలు బారిన పడుతున్నారు. ఆగస్టులో జిల్లాలో 169 డెంగీ కేసులు నమోదు కాగా, సెప్టెంబర్‌లో 165 కేసులు నమోదయ్యాయి. ఈనెల ఇప్పటి వరకు 23 డెంగీ కేసుల నమోదయ్యాయి. ఆగస్టులో 134 టైఫాయిడ్ కేసులు, సెప్టెంబర్‌లో 45, ఈనెలలో ఇప్పటి వరకు 17 మందికి టైఫాయిడ్ సోకింది. జిల్లాలో ఆగస్టులో 275 మంది డయేరియా బారిన పడ్డారు. గతనెల 309 మంది, ఈనెల ఇప్పటి వరకు 108 మందికి డయేరియా సోకి దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ దవాఖానల్లో మందుల కొరత రోగులను వేధిస్తున్నది. విషజ్వరాలు సోకిన వారికి చికిత్స అందజేసేందుకు అవసరమైన పలురకాల మందులు ప్రభుత్వ దవాఖానల్లో అందుబాటులో లేవు.

### అమెరికా ఎన్నికల ప్రచారంలో

# తెలుగులో బ్యానర్లు

**అమరావతి, అక్టోబరు 13:** అమెరికాలో తెలుగువారి ప్రాబల్యం పెరిగిపోతోంది.




తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవంతో పాటు భారతీయ పండుగలకు అమెరికాలో సెలవులు ఇస్తున్నారు. అక్కడి వీధులకు భారతీయ ప్రముఖుల పేర్లు పెడుతున్నారు. తాజాగా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలోనూ తెలుగులో రాసి ఉన్న బ్యానర్లు అమెరికా వీధుల్లో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ప్రచార హడావుడి నెలకొంది. ఈ నేపథ్యంలో డల్లాసలో 'సంస్కృతి, సన్మార్గం–దేశానికి ఆధారం' అని రాసి ఉన్న బ్యానర్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. అలాగే తమిళంలో రాసిన బ్యానర్లు కూడా కనిపిస్తున్నాయి. పై చదువుల కోసం అమెరికాకు వెళ్లి, అక్కడే ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడుతున్న తెలుగు వారి సంఖ్య యేటా పెరుగుతోంది. ఈ క్రమంలోనే అమెరికా రాజకీయాల్లో కూడా తెలుగువారు, భారతీయులు కీలకంగా వ్యవహరిస్తున్నారు. భారత సంతతికి చెందినవారు అమెరికాలో సెనెటర్ల వంటి పదవుల నుంచి నేడు ఏకంగా ఆ దేశ అధ్యక్ష పదవికి పోటీ చేసే స్థాయికి ఎదిగారు. డెమొక్రాట్ల తరఫున భారత సంతతికి చెందిన కమలా హారిస్ అధ్యక్ష బరిలో ఉన్నారు. రిపబ్లికన్ల తరఫున ఉపాధ్యక్షుడిగా ట్రంప్ బలపర్చిన వాన్స్.. భారత సంతతికి చెందిన తెలుగమ్మాయి ఉషా చిలూకూరి భర్త కావడం విశేషం. దీంతో అమెరికా ఎన్నికల్లో రిపబ్లికన్లు, డెమొక్రాట్లు ఎవరు గెలిచినా భారత్‌కు గర్వకారణమే. వాన్స్ రిపబ్లికన్ల తరఫున ఉండటంతో తెలుగు ప్రవాసులు ఏ పార్టీ వైపు ఉన్నారనేది కూడా చర్చనీయాంశంగా మారింది. దీంతో, తెలుగువారిని ప్రసన్నం చేసుకోవడానికి ఇరుపార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

# కమలా హారిస్‌కు రెహమాన్ మద్దతు

**ఎన్నికల ప్రచారానికి 30 నిమిషాల వీడియో రూపకల్పన**



వాషింగ్టన్, అక్టోబరు 13: అమెరికాలో అధ్యక్ష ఎన్నికల హడావుడి నెలకొంది. నవంబరు 5న జరిగే ఎన్నికల్లో ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ డెమొక్రటిక్ అభ్యర్థిగా పోటీపడుతున్నారు. ఆమె ఎన్నికల ప్రచారానికి ఊతమిచ్చేలా లెజెండరీ మ్యూజిక్ డైరెక్టర్, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ 30 నిమిషాల నిడివిగల ఒక ప్రత్యేక వీడియోను రూపొందించారు. ఇండో–ఆఫ్రికా సంతతికి చెందిన హారిసకు ఈ ఎన్నికల్లో మద్దతు పలికిన తొలి అంతర్జాతీయ కళాకారుడు రెహమాన్ కావడం విశేషం. 'అమెరికాలో ప్రగతి, ప్రాతినిధ్యం కోసం నిలబడిన నాయకులు, కళాకారుల బృందానికి మద్దతుగా ఏఆర్ రెహమాన్ తన గాత్రాన్ని అందించారు. కమలా హారిస్ ఎన్నికల ప్రచారం కోసం ప్రత్యేకంగా 30 నిమిషాల వీడియోను రూపొందించారు' అని 'ది ఏషియన్ అమెరికన్ పసిఫిక్ ఐలాండర్స్ (ఏఐపీఐ)' విక్టరీ ఫండ్ సంస్థ చైర్మన్ శేఖర్ నరసింహన్ పేర్కొన్నారు. తమిళ మూలాలున్న కమలా హారిసకు ఈ ఎన్నికల్లో ఏఐపీఐ విక్టరీ ఫండ్ సంస్థ మద్దతుగా నిలిచింది. దానికి ఏఆర్ రెహమాన్ కూడా తోడ్పాటునందించారు. 'ఇది ఒక సంగీత కార్యక్రమం మాత్రమే కాదు. అమెరికాలో మా సంఘాలు, మేం చూడాలనుకునే భవిష్యత్తుకు ఓటు వేయాలని మా కమ్యూనిటీలకు ఇస్తున్న పిలుపు' అని నరసింహన్ తెలిపారు. ఈ నెల 13వ తేదీ రాత్రి రెహమాన్ రూపొందించిన వీడియోను ఏఏపీఐ విక్టరీ ఫండ్... యూట్యూబ్‌లోనూ ప్రసారం చేయనుంది. ఈ వీడియోలో రెహమాన్‌కు అత్యంత ఇష్టమైన కొన్ని పాటలు ఉంటాయని, అలాగే హారిస్ అభ్యర్థిత్వం, ఏఏపీఐ కమ్యూనిటీ పట్ల నిబద్ధతను తెలియజేస్తూ కొన్ని సందేశాలు ఉంటాయని ఆ సంస్థ పేర్కొంది.


# గుజరాత్‌లో రూ.5వేల కోట్ల కొకైన్ సీజ్



**ఢిల్లీ, అక్టోబరు 13:** గుజరాత్‌లో భారీ స్థాయిలో డ్రగ్స్ డెన్ బట్టబయలైంది. రూ5,620 కోట్ల విలువైన 518 కిలోల కొకైన్ పట్టుబడింది. ఢిల్లీ, గుజరాత్ పోలీసులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించి గుజరాత్ అంకలేశ్వర్‌లోని అవకర్ డ్రగ్స్ లిమిటెడ్ ఫార్మా కంపెనీ నుంచి డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి ఢిల్లీకి చెందిన తుషార్(40), హిమాన్షు(27), ఔరంగాజేబ్ (23), ముంబైకి చెందిన భరత్ కుమార్ జైన్ (48), యూపీలోని హాపూర్‌కు చెందిన అఖ్‌లక్‌ను అరెస్టు చేశారు. గత 11 రోజుల్లో ఈ స్థాయిలో డ్రగ్స్ సీజ్ చేయడం మూడోసారి కావడం కావడం గమనార్హం. అక్టోబరు 10న ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ బృందం రూ.2వేల కోట్ల విలువైన 200 కిలోల కొకైన్‌ను ఢిల్లీలో స్వాధీనం చేసుకున్నారు.

## కలెక్టరేట్ వార్ రూమ్ సెక్యూరిటీ గన్‌తో కాల్చుకొని ఆత్మహత్య..

**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 13:**



జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ లో వార్ రూము వద్ద విధులు నిర్వహిస్తున్న జి శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం తెలిసిన వెంటనే జిల్లా ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.. వివరాల్లోకి వెళితే మృతి చెందిన కానిస్టేబుల్ పేరు గుడిబోయిన శ్రీనివాస్, 1990 కి చెందిన బ్యాచ్, ఏ ఆర్ హెచ్ సి 1785, జిల్లా కేంద్రంలోని గోపాలపురం కాలనీలో నివసిస్తున్నారు, ఇతనికి ఒక కొడుకు సుశాంత్ మరియు భార్య విజయలక్ష్మి ఉన్నారు, భార్యాభర్తల మధ్య వివాదాలే కారణంగా తెలుస్తోంది, వివరాలు తెలియవలసి ఉంది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101